సాక్షి
గుంటూరు
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024




మహాలక్ష్మి గుండెపాటమ్మ తిరునాళ్ల

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామ దేవత మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారి తిరునాళ్ల శనివారం ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రవికిరణ్ పాల్గొన్నారు.



విస్తృతంగా వాహనాల తనిఖీలు

భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం భట్టిప్రోలు చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక బృందానికి చెందిన అధికారిణి జ్యోతి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 507.50 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,700 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

బగళాముఖి అమ్మవారిని సందర్శించిన జస్టిస్ శివశంకర్



చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలు ఉన్న ప్రముఖ ఆలయాలను రాష్ట్ర జ్యుడీషియల్ రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ శివ శంకర్ శనివారం సందర్శించారు. తొలుత స్వయంభువు శ్రీ బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మేనేజర్ నరసింహమూర్తి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించి అమ్మవారి చిత్రపటాలను జ్ఞాపికగా అందజేశారు. అనంతరం ప్రముఖ శైవ క్షేత్రమైన లింగోద్భవస్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. శివశంకర్ వెంట హైకోర్టు న్యాయమూర్తి గుంటూరు శేషమోహన్ ఉన్నారు.

నిఘా తీవ్రం చేయండి

మాచర్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో డెప్యూటీ కమిషనర్ కె. హేమంత్ నాగరాజు శనివారం సిబ్బందితో కలసి మాచర్ల, విజయపురిసౌత్ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విజయపురిసౌత్ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేశారు. అక్రమంగా మద్యం రవాణా కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద పూర్తిస్థాయిలో తనిఖీ చేపట్టాలని చెప్పారు. ఆయన వెంట మాచర్ల సెబ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.పి. కిశోర్, ఎం. రవీంద్రబాబు తదితరులున్నారు

ఎంపీ స్థానానికి మరో ఐదుగురు నామినేషన్

గుంటూరువెస్ట్: గుంటూరు పార్లమెంట్ స్థానానికి శనివారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి నామినేషన్లు పత్రాలు దాఖలు చేశారు. మొహమ్మద్ ఖాజా మొహిద్దీన్ చిష్టి పాషా (ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి) సయ్యద్ సైదా (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), డాక్టర్ రాజేష్ ఆర్ విజయ్‌కుమార్ (ఇండియన్ లేబర్ పార్టీ), కాసు ఏసురెడ్డి (ఇండిపెండెంట్), వెంకటరమణ బోయపాటి (ఇండిపెండెంట్) నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు.

టీడీపీ పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవిపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: టీడీపీ ప్రచారంలో బాలుడిని వినియోగించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీ టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు వేళంగినినగర్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆరు సంవత్సరాల బాలుడిని ప్రచారంలో ఉపయోగించారు. దీనిపై ఎంసీసీ టీమ్ ఇన్‌చార్జి ఝాన్సీరాణి టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవిపై అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లిని రక్షించబోయి..

- అన్న, స్నేహితుడు గల్లంతు
- అడిగొప్పల సమీపంలోని సాగర్ కుడికాల్వ వద్ద ఘటన

దుర్గి: చెల్లిని రక్షించబోయి అన్న, అతని స్నేహితుడు ఇద్దరు గల్లంతైన ఘటన మండలంలోని అడిగొప్పల సమీపంలోని సాగర్ కుడి కాల్వలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన షేక్ మస్తాన్‌బీ అడిగొప్పల పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తగా పని చేస్తోంది. ఆమె కుమారుడు షేక్ ఇస్మాయిల్ రెండు రోజుల క్రితం అతని పుట్టినరోజు సందర్భంగా గుంటూరు నుంచి అడిగొప్పలకు అతని స్నేహితుడు షేక్ యూసఫ్ కలసి తల్లి మస్తాన్‌బీ వద్దకు వచ్చాడు. శనివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు గ్రామ సమీపంలోని సాగర్ కాల్వ కట్టకు కుటుంబ సభ్యులంతా వెళ్లారు. వారంతా సరదాగా నీటి వద్ద గడుపుతుండగా వారి పక్కనే ఇస్మాయిల్ చెల్లెలు కాల్వలో పడిపోయింది. అన్న ఇస్మాయిల్, అతని స్నేహితుడు యూసఫ్ కాల్వలో దూకి చెల్లిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఇద్దరు కాల్వ నుంచి ఒడ్డుకు వస్తున్న క్రమంలో నీటి ప్రవాహవేగానికి కొట్టుకుపోయారు. స్నేహితులిద్దరు పదవ తరగతి పరీక్షలు రాశారు. ఇద్దరి వయస్సు 16 సంవత్సరాలు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటయ్య, పోలీసులు గల్లంతైనవారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఘటనా స్థలికి చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడారు. కాల్వకు నీటి ప్రవాహం తగ్గించి గాలింపు చర్యలు చేపట్టాలని పీఆర్కే నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

అద్వితీయం.. అభిమాన తరంగం

పండుగ వాతావరణంలో వైఎస్సార్‌సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని నామినేషన్

- ఉప్పొంగిన జల కెరటంలా తరలివచ్చిన జనసందోహం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో జనమయంగా మారిన గుంటూరు నగరం
- భారీ ర్యాలీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- అడుగడుగునా అభ్యర్థికి క్రేన్‌లతో స్వాగత మాలలు
- దారి పొడవునా అభిమాన జన సమూహాల సంఘీభావం
- తీన్‌మార్ డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్న ర్యాలీ

మహా కురుక్షేత్ర సంగ్రామానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైన్యం 'మేమంతా సిద్ధం' అంటూ నినదించింది. జగనార్జునుడి అమ్ముల పొదిలో బాణాల్లా ప్రతిపక్షాల కుట్రలను చీల్చి చెండాడతామని తేల్చిచెప్పింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 'రజినమ్మ రాజ్యం' తథ్యమని చాటి చెప్పింది. పశ్చిమలో రజినమ్మకు అండగా నిలిచి, తెలుగు దేశం కోటను బద్దలు కొడతామని వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రతిన బూనారు.



ప్రత్యేక వాహనంపై విడదల రజిని, కిలారి, ఏసురత్నం, అప్పిరెడ్డి, మద్దాళి, వజ్రబాబు



అభివాదం చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి రజిని, లోక్‌సభ అభ్యర్థి కిలారి

పట్నంబజారు: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని నామినేషన్ దాఖలు కార్యక్రమం శనివారం పండుగ వాతావరణంలో జరిగింది. ఉవ్వెత్తున ఎగసిపడిన కడలి అలలను తలపించేలా వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి నామినేషన్ ఘట్టాన్ని విజయవంతం చేశాయి. ముందుగా అభ్యర్థి, మంత్రి రజిని తన స్వగృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుంటూరు చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు అభ్యర్థి విడదల రజిని, తన భర్త కుమారస్వామితో కలిసి బయలుదేరగా, వారి కుటుంబ సభ్యులు ఆ దంపతుల వెంట నడిచారు. అప్పటికే అక్కడకు పెద్ద ఎత్తున చేరుకున్న పార్టీ శ్రేణులు దంపతులకు స్వాగతం పలికి ర్యాలీగా ముందుకు కదిలారు. ర్యాలీలో అగ్రభాగాన పార్టీ లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంతో పాటు పార్టీ ముఖ్యనేతలు మంత్రి రజిని వెంట నిలిచారు.

ఎక్కడికక్కడ ఘన స్వాగతం..

దారిపొడవునా క్రేన్‌ల సాయంతో మంత్రి విడదల రజినికి భారీ గజమాలలతో ఘన స్వాగతం పలికారు. జైన్ సంఘం నేతలు పలువురు మార్గ మధ్యలో మంత్రి రజినిని వారి సాంప్రదాయ పద్ధతిలో సత్కరించి, తలపాగా చుట్టారు. లాడ్జిసెంటర్‌లో మాల ఐక్య సేవా సమితి నేతలు మహిళలతో ఎదురేగి స్వాగతం పలికారు. అరండల్‌పేట 13వ లైను వద్ద బ్రాహ్మణ సంఘం నేతలు రజినికి మద్దతు తెలియజేశారు. తీన్‌మాన్ డప్పులు, వివిధ వేషధారణలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేద సీడ్స్ అధినేత తులసీ ధర్మచరణ్ మంత్రి రజిని నామినేషన్ కార్యక్రమంలో భాగంగా ఆల్ ది బెస్ట్ అంటూ.. శుభాకాంక్షలు తెలిపారు.



గుంటూరులో విడదల రజిని నామినేషన్ కార్యక్రమానికి హాజరైన జనవాహిని

భారీ ర్యాలీ సాగిందిలా...

పార్టీ కార్యాలయం నుంచి కొరిటెపాడు, లాడ్జి సెంటర్ వరకు చేరుకుని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి విడదల రజిని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి శంకర్ విలాస్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి, ఏసీ కళాశాల, హిందూ కళాశాల కూడలి మీదుగా కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలు దాఖలు సమయంలో మంత్రి వెంట ఆమె భర్త కుమారస్వామి, నేతలు లేళ్ల అప్పిరెడ్డి, మద్దాళి గిరి, ఏసురత్నం ఉన్నారు.



ఆర్‌ఓకి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రజిని, పక్కన లేళ్ల, గిరి, చంద్రగిరి, కుమారస్వామి

ఎంపీని సత్కరించిన మంత్రి రజిని దంపతులు



పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా శనివారం నామినేషన్ దాఖలు చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినిని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అభినందించారు. శనివారం శ్యామలానగర్‌లోని ఆమె నివాసంలో నామినేషన్‌కు ముందుగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి రజిని, కుమారస్వామి దంపతులు ఎంపీ అయోధ్యరామిరెడ్డిని సత్కరించారు.

వెస్ట్‌లో విజయం తథ్యం

సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో జగనన్న చెరగని ముద్ర వేసుకున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నామినేషన్ దాఖలు అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని, నియోజకవర్గంలో గెలిచి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు ప్రజలకు తానున్నానే భరోసా కల్పించిన నేత జగనన్నను ఎప్పుడెప్పుడు మళ్లీ సీఎంగా చేసుకుందామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. మీ రజినమ్మగా పశ్చిమలో పోటీ చేస్తున్న తనకు మద్దతుగా నామినేషన్ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఇంటి బిడ్డగా తనను దీవించాలని ఆకాంక్షించారు.

కూటమిని ప్రజలు నమ్మరు

రాష్ట్రంలోని ప్రతి గడపకు ప్రభుత్వాన్ని చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి రోశయ్య చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న బస్సుయాత్రకు వస్తున్న విశేష స్పందన చూసిన తరువాత వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని తేలిపోయిందన్నారు. దుష్ప్రచారాల పార్టీ టీడీపీ, కూటమిని ప్రజలను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. తాము స్థానికులమని, అన్ని విధాలుగా అందుబాటులో ఉంటామని, ఎంపీ అభ్యర్థిగా నిలబడుతున్న తనను, ఏడు నియోజకవర్గాల్లో నిలబడుతున్న అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు.

రజినమ్మ విజయం ఖాయం

శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పశ్చిమలో రజినమ్మ విజయం ఖాయమని చెప్పారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా, వేలాది మంది వచ్చి నామినేషన్ కార్యక్రమానికి వచ్చి స్వాగతం పలికిన తీరు విజయానికి నాంది అని స్పష్టం చేశారు. ఖచ్చితంగా భారీ మెజారిటీతో గెలిచి, ఇదే విధంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. చంద్రబాబు నోటికొచ్చినట్టు రాళ్ళు వేయండి అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటన్నారు. నలభై ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు ఇన్ని ఏళ్లలో ఈ మంచి చేశానని చెప్పగలరా అని ప్రశ్నించారు. మంచి చేస్తే ఓటు వేయండనే ధైర్యం సీఎం వైఎస్ జగన్‌కు తప్ప మరెవరికి లేదన్నారు. రజినమ్మ నామినేషన్ రోజునే గెలిచిందని చెప్పారు. వైఎస్సార్ సీపీ నేతలు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిస్తాం.. పార్టీలో చేరండి



మంగళగిరి, గుంటూరు నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ డబ్బు రాజకీయాలకు తెరలేపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధితో ప్రజలు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గుచూపుతున్నారు. జనం ఓట్లతో గెలవలేమని గ్రహించిన తెలుగుదేశం పార్టీ అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకునేందుకు తంటాలుపడుతోంది.

- పార్టీలో చేరేవారికోసం దేశం వేట
- స్థాయిని బట్టి రేటు
- వలంటీర్‌కి వేలల్లో
- కార్పొరేటర్ స్థాయి ఉంటే రూ.లక్షల్లో
- చేరికల కోసం ప్రత్యేక బృందాలు
- కండువా కప్పుకుంటే సామాన్య కార్యకర్తకు రెండు వేలు
- మంగళగిరి, గుంటూరులో తెలుగుదేశం కొత్త ఎత్తుగడలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ ప్రలోభాల పర్వానికి తెరలేపింది. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడి కుమారుడు లోకేష్ మంగళగిరి నుంచి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలో దిగారు. ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో కొనుగోళ్ల పర్వానికి తెరలేపారు. అధికార పార్టీలోని చోటామోటా నేతల నుంచి కార్యకర్తల వరకూ ప్రలోభాలకు గురి చేసి కొనుగోళ్లు చేయడానికి తెరలేపారు. గుంటూరు పార్లమెంట్‌కు కూడా ధనవంతుడైన ఎన్‌ఆర్‌ఐని రంగంలోకి దింపడంతో అతను కూడా గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఇదే తరహా దందాకు తెరలేపారు. దీని కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. వీరు తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి ఆ గ్రామంలో ప్రభావం చూపగల వ్యక్తులను ఎంపిక చేసుకుని వారితో బేరసారాలు మొదలు పెడుతున్నారు. వారిని తమవైపు తిప్పుకుని వారి ద్వారా మరికొందరిని కొనుగోలు చేసేపనిపై దృష్టి పెట్టారు. పెదకాకాని మండలంలోని ఒక గ్రామంలో ఓ యువకుడికి లక్షలు ఆశ చూపి తమవైపుకు తిప్పుకున్నారంటే వారు ఏస్థాయిలో డబ్బులు వెదజల్లడానికి సిద్ధం అవుతున్నారో అర్థం అవుతుంది.

ఎగవేతదారుడికి రూ.కోట్ల అప్పు

మంగళగిరి నియోజకవర్గంలో తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన ఒక నేత చాలా మంది వద్ద అప్పులు తీసుకొని ఎగ్గొట్టాడు. అతనికి అధికార పార్టీ మద్దతు పలకపోవటంతో లోకేష్ సమక్షంలో పార్టీలో చేరారు. అతనికి పొలంపైన కోట్లాది రూపాయల అప్పు ఇచ్చి తమ వైపు తిప్పుకున్నారు. అతని వెంటే ఉండే కొంతమంది యువకులకు లక్ష చొప్పున పదిమందికి ఇచ్చారు. వీరందరిని తమ వెంట తిప్పుకుంటున్నారు. ప్రస్తుతం నియోజవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అని తెలిస్తే చాలు, అతని ఆర్థిక పరిస్థితులు, అతనికి ప్రజల్లో ఉన్న పట్టును బట్టి రూ.వేల నుంచి లక్ష రూపాయల వరకూ ఇస్తున్నారు. సామాన్యులను టీడీపీ కార్యాలయానికి తీసుకెళ్లి కండువా కప్పిస్తే ఒక్కొక్కరికి వేలాది రూపాయలు ఇస్తున్నారు.

సెల్‌ఫోన్...రూ.లక్ష

ఈ మధ్యకాలంలో నులకపేటలో సెల్‌ఫోన్ కూడా లేని ఒక వ్యక్తికి లక్ష రూపాయలు డబ్బులు ఇస్తానని చెప్పి పార్టీలో చేర్చుకున్నారు. అతనికి ఒక సెల్‌ఫోను లక్ష రూపాయలు ఇచ్చారు. సెల్‌ఫోన్‌పై తమ పార్టీ స్టిక్కర్ వేసుకుంటే రూ. వందల్లో ఇస్తున్నారు.

వలంటీర్లకు ఉద్యోగాల ఆశ

ఇక్కడితో ఆగకుండా రాజీనామా చేసిన వలంటీర్లకు డబ్బు ఆశ చూపించి పార్టీలో చేర్పించుకుంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని, తమకు ఓట్లు వేయించాలని వారికి ఆశ చూపిస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 700 మంది వాలంటీర్లు రాజీనామా చేయగా అందులో ఇప్పటికే 100 మంది వాలంటీర్లను కలిసి ప్రలోభాలకు గురి చేసి, వారు పార్టీలో చేరినా, చేరకపోయినా పది వేల నుంచి 20 వేలు ఇచ్చి తమవైపుకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అసంతృప్తివాదుల కోసం వేట

గుంటూరు పార్లమెంట్ వ్యాప్తంగా కొంచెం అసంతృప్తిగా ఉన్న పార్టీ కేడర్‌ను గుర్తించి వారిని కొనుగోలు చేసేందుకు పెమ్మసాని టీం రంగంలోకి దిగింది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, కార్పొరేటర్లు, బీఎల్‌ఓల జాబితాలను సంపాదించి వైఎస్సార్ సీపీలోనే ఉంటూ తమకు సహకరించేలా వారికి డబ్బులు ఇచ్చి ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం.

కార్పొరేటర్లకు గాలం

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 10, 12, 14 డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు మీరావలి, ఖాజా మొహిద్దీన్ చిస్టి, వేముల జ్యోతి పద్మజ ఇటీవల టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభానితో కలిసి టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎండీ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టచెప్పినట్లు సమాచారం. వీరితోపాటు మరి కొందరికి ఆఫర్లు ఇచ్చినట్లు తెలిసింది. పార్టీలోకి వస్తే లక్షలు ఇస్తామంటూ బేరం పెడుతున్నారు. రెండురోజుల క్రితం అధికార పార్టీ కార్పొరేటర్ పుట్టినరోజు కావడంతో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పడంతోపాటు తమ బావను, పార్టీ నేతలను శుభాకాంక్షలు చెప్పేందుకు అతని ఇంటికి పంపించారు. ఈవిధంగా ఏదో విధంగా తమవైపు తిప్పుకునేందుకు తెలుగుదేశం నేతలు సన్నద్ధమవుతున్నారు.



వెంకటరెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

వెంకటరెడ్డికి ఘన నివాళులు

అంతిమ యాత్రలో భారీగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పట్టణ పరిధిలో సీఎస్ఆర్ కల్యాణ మండపంలో టీడీపీ అరాచకానికి బలైన జేసీఎస్ కన్వీనర్ మేకా వెంకటరెడ్డి (50) అంతిమయాత్ర శనివారం తాడేపల్లి నుంచి కుంచనపల్లి స్వర్గపురి వరకు నిర్వహించారు. వెంకటరెడ్డి ఇంటివద్దకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకుని నివాళులర్పించారు. ముందుగా ప్రభుత్వ సలహాదారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డిలు వెంకటరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ఎల్లవేళలా వెంకటరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అంతిమ యాత్ర ఇలా...

మేకా వెంకటరెడ్డి నివాసం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర పార్టీ కార్యాలయం మీదుగా కుంచనపల్లి స్వర్గపురి వరకు నిర్వహించారు. దారి పొడవునా వెంకటరెడ్డి అమర్ రహే, తెలుగుదేశం గూండాలను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ప్రత్యేక వాహనంపై వెంకటరెడ్డి మృతదేహం ఉంచారు. దారి పొడవునా పూలు చల్లారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యలు అంతిమ యాత్ర పూర్తయ్యే వరకు ఉండి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వెంకటరెడ్డి మృతికి కారణమైన వారిని శిక్షించే వరకు పోరాటం నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు వెల్లడించారు. అంతిమ యాత్రలో ఆయన మంచితనం వల్ల స్థానికంగా ఉన్న అన్ని పార్టీల నాయకులు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ ఈదుల మూడి డేవిడ్ రాజు, ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, రూరల్ మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, మేకా వెంకటరామిరెడ్డి, భూపతి కిషోర్‌నాయుడు, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, మేడా పండు, బాలసాని అనిల్, ముదికొండ ప్రకాష్, బత్తుల దాసు, మేకల నాగయ్య, మహేష్, నియోజకవర్గంలోని మంగళగిరి పట్టణ రూరల్, దుగ్గిరాల మండలం నుండి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకటరెడ్డి మృతదేహం

క్లుప్తంగా

25న మాక్ పాలిసెట్



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 25న మాక్ పాలిసెట్–2024 నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. శనివారం కళాశాలలో మాక్ పాలిసెట్ సమాచార పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా రామకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాక్ పాలిసెట్‌కు హాజరు కావచ్చునని తెలిపారు. పరీక్షా రాసేందుకు ఎటువంటి ప్రవేశ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 25న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరగనున్న మాక్ పాలిసెట్‌కు హాజరయ్యేందుకు విద్యార్థులు 83329 11155, 93907 87574 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఎనిమిది నామినేషన్లు దాఖలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి శనివారం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. తూర్పు నియోజకవర్గ పరిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి తరపున షేక్ ఆరిఫ్, షేక్ అల్తాఫ్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా వహీద్ షకీల్ అహ్మద్, షేక్ సిలార్‌లు తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ కీర్తి చేకూరికి నామినేషన్ పత్రాలు అందజేశారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ తరపున విడదల రజిని రెండు సెట్లు, గల్లా రామచంద్రరావు టీడీపీ తరపున ఆళ్ల నాగేశ్వరరావు, గల్లా మాధవి టీడీపీ అభ్యర్థి తరపున గూడూరు రామకోటేశ్వరరావులు పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

ముగిసిన అగ్నిమాపక శాఖ వారోత్సవాలు



పట్నంబజారు: అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సభ శనివారం గుంటూరు–1 అగ్నిమాపక కేంద్రంలో జరిగింది. కార్యక్రమానికి జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.కృష్ణవేణి, అగ్నిమాపక ప్రాంతీయ అధికారి ఎ.క్యూ.జిలానీ, అగ్నిమాపక జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, జిల్లా సహాయ అధికారి కె.కృష్ణారెడ్డి, గుంటూరు–2 అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు అగ్నిమాపక వారోత్సవాల నిర్వహణకు గల కారణాలు, ప్రాముఖ్యతను వివరించారు. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో రెస్క్యూ టీమ్ నిర్వహించే ఆపరేషన్‌ల గురించి డెమో నిర్వహించారు.

పార్టీలకతీతంగా సంక్షేమం

- వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

తాడికొండ: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు టీడీపీ నాయకులు శనివారం ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. మేడికొండూరు మండలం పేరేచర్ల లక్ష్మీ నరసింహ కాలనీ, తాడికొండ మండలం లాం గ్రామం నుంచి పలువురు తెలుగుదేశం పార్టీ క్రియాశీలక నాయకులు గుంటూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రతి పేదవాడికి అందుతున్న సంక్షేమం, అభివృద్ధి చూసి జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని తాము వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ పార్టీలకతీతంగా జగనన్న అందించిన సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి గుండెను కదిలిస్తున్నాయని, యావత్ రాష్ట్ర ప్రజలు జగనన్నను మళ్లీ సీఎంగా చూసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మేడికొండూరు మండల ఎంపీపీ మన్నవ స్వప్న, రాజేష్, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు శృంగార పాటి సందీప్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ స్క్రీన్‌పై ఐపీఎల్ మ్యాచ్

ఎస్‌ఆర్‌హెచ్ – డీసీ మ్యాచ్‌ను ఉత్సాహంగా వీక్షించిన ప్రేక్షకులు



మ్యాచ్ చూస్తూ కేరింతలు కొడుతున్న ప్రేక్షకులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): టాటా ఐపీఎల్ సీజన్‌లో భాగంగా బీసీసీఐ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని ఎల్‌ఈఎం స్కూల్‌లో భారీ స్క్రీన్‌పై క్రికెట్ మ్యాచ్‌లు వీక్షించే ఏర్పాటు చేశారు. ఢిల్లీ క్యాపిటల్– సన్ రైజెస్ హైదరాబాద్ మధ్య మ్యాచ్‌ను ప్రేక్షకులు ఉత్సాహంగా చూశారు. బాల్ బాల్‌కు కేరింతలు కొడుతూ తమ అభిమాన క్రికెటర్ల ఆటను ఆస్వాదించారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎస్.పి.వి.రమణమూర్తి మాట్లాడుతూ ఆదివారం కూడా రెండు మ్యాచ్‌లు ఉన్నాయన్నారు. ప్రేక్షకులు వీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బీసీసీఐ మన జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీసీఐ ఆపరేషన్స్ మేనేజర్ అల్విన్ గైక్వాడ్, సభ్యులు అన్నం రాజు సాయిరామ్, రామశర్మ, తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్‌లో ప్రతిభతో అన్ని సబ్జెక్టుల్లో రాణింపు



విద్యార్థులతో ఏజీఎం అంజయ్య, ప్రిన్సిపాల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: గణితశాస్త్రంలో ప్రతిభ చూపడం ద్వారా ఇతర అన్ని సబ్జెక్టుల్లో రాణించడం సులువని శ్రీచైతన్య స్కూల్స్ ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని శ్రీచైతన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోగ్రామ్ ఫర్ ఎక్సలెన్స్‌లో భాగంగా గణితంలో 100 టేబుల్స్ పోటీలను నిర్వహించారు. ప్రాంతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన 24 క్యాంపస్‌లకు చెందిన 34 మంది విద్యార్థులకు శనివారం జోనల్ స్థాయి పోటీలను శనివారం నవభారత్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్లో నిర్వహించారు. ఈసందర్భంగా అంజయ్య మాట్లాడుతూ గణితంలో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా విద్యార్థులు జీవితంలో మేధావులుగా రాణించగలరని అన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో లక్ష్మీపురం క్యాంపస్‌కు చెందిన ఐదో తరగతి విద్యార్థినులు మేధ నాగ బృహతి, లాలసలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. పొన్నూరు క్యాంపస్‌కు చెందిన నాలుగో తరగతి విద్యార్థి లిఖిత్ తృతీయ స్థానంలో నిలువగా, యశ్విత, వెంకట లోకేష్, అమన్ రషీద్ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్స్ ఎ.శైలజ, నర్మద, మాధురి, అరుందతి, బాషా, జోనల్ కో–ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ యాత్రికులకు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్ : అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే జిల్లా వాసులకు గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్‌బాబు తెలిపారు. వైద్య పరీక్షలకు వచ్చేవారు పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు, ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్రకి సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్ నమూనా రెండు కాపీలు, వయస్సు నిర్ధారణ, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సంబంధిత పత్రాలతో ఆసుపత్రిలో సంప్రదించాలన్నారు. యాత్రకు వెళ్లే వారు మెడికల్ సర్టిఫికెట్ కోసం రూ. 1500లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆఫీసు ఆసుపత్రి స్టాంపేజ్ కౌంటర్‌లో చెల్లించాలన్నారు. ఈనెల 23 నుంచి సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. వైద్య పరీక్షలనంతరం ధ్రువపత్రాల మంజూరుకు వైద్యులను నియమించినట్లు డాక్టర్ సుధీర్ బాబు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌పై ఆందోళన వద్దు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పోస్టల్ బ్యాలెట్‌పై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ జిల్లాలో పనిచేస్తూ వేరే జిల్లాలో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు కూడా తమ ఓటు హక్కును ఇక్కడే వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని, దీంతో ఓటు వేసేందుకు వేరే జిల్లాకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే ఓటు వేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. దీనికోసం సెక్రటేరియేట్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారని, ఫారం–12 సబ్‌మిట్ చేయడానికి ఈ నెల 26 వరకూ గడువు పొడిగించారన్నారు. ఎక్సెంజ్–1 ఫారం–12కి 28 వరకూ గడువు ఉందని, పోల్ కాని పోస్టల్ బ్యాలెట్లను మే 3 నాటికి వెనక్కి పంపుతారన్నారు. ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ నిర్వహించడానికి మే 8 వరకు ఎన్నికల సంఘం గడువు ఇచ్చిందన్నారు. పోలైన పోస్టల్ బ్యాలెట్లను 10 వ తేదీనాటికి ఆయా జిల్లాలకు పంపిస్తారన్నారు. ప్రస్తుతం పీఓ, ఏపీఓలకు ట్రైనింగ్ సందర్భంగా బ్యాలెట్ అందజేశారన్నారు. మిగిలిన విభాగాల సిబ్బంది ఎవరైతే ఎన్నికల విధుల్లో పాల్గొంటారో వారికి ఆయా విభాగాల నోడల్ ఆఫీసర్ల నుంచి బ్యాలెట్ అందచేస్తారన్నారు. వీరందరు ఓటు వేసేందుకు ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారన్నారు. అక్కడే వారు తమ ఓటును వినియోగించుకోవచ్చని తెలిపారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణకు ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. వీరికి బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ కల్పిస్తామన్నారు. వివరాలకు 90004 87423 సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్



జస్టిస్ కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో గౌరవప్రదమైన స్థానముందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ బీఈడీ, డీఈడీ కళాశాల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ అత్యంత గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తి ద్వారా విద్యార్థుల్లో సమగ్ర మూర్తిమత్వాన్ని అందించే బాధ్యత గురువులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు మానసిక విశ్లేషణతో గురుతర బాధ్యతలను నిర్వహించి భావి పౌరులను తయారు చేయాలని ఆకాంక్షించారు. విలువలు, సత్ప్రవర్తనతో కలగలసిన సమాజాన్ని తయారు చేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణకు పెద్దపీట వేసి, మానవతా విలువలు కలిగిన భావి ఉపాధ్యాయులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈసందర్భంగా హిందూ విద్యా సంస్థల దాతలు వివిధ బ్యాచ్‌లలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. సహపాఠ్య కార్యక్రమాలు, వివిధ ఆటపాటల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల అధ్యక్షుడు మాజేటి సోమశేఖరరావు, ఉపాధ్యక్షుడు మాజేటి వీఆర్‌ఎస్ ప్రసాద్, కార్యదర్శి చింతలపాటి వేంకట రామయ్య, హిందూ కాలేజ్ హైస్కూల్ అధ్యక్షుడు శ్రీ జి.శివరామకృష్ణ ప్రసాద్, కార్యదర్శి కేఎస్‌ఆర్ కుటుంబరావు, కళాశాల సంయుక్త కార్యదర్శి ఆర్.రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ శ్రీదేవి, సమన్వయకర్త మాజేటి జయలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఓటు హక్కు వినియోగంపై వినతి

డీఆర్వోకు వినతిపత్రం అందజేసిన ఏపీ జేఏసీ నేతలు



డీఆర్వో పెద్ది రోజాకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

గుంటూరు మెడికల్: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఉన్న ఇబ్బందుల గురించి శనివారం ఏపీ జేఏసీ జిల్లా నేతలు జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఓపీఓ, ఇతర సిబ్బంది ఫారమ్–12డీ ఎక్కడ సమర్పించాలనే దానిపై తమకు సందేహాలు ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ సమర్పించే గడువు పొడిగించాలని కోరారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయ, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించే అందరికీ ఒకే విధమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ ఫారమ్–12 డీ మండల తహసీల్దార్‌కు సమర్పించిన తరువాత తప్పనిసరిగా ఎక్నాలెడ్జ్‌మెంట్‌ను సిబ్బందికి ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కన్వీనర్ శెట్టిపల్లి సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బసవ లింగారావు, వేళంగిణిరాజు, కళాధర్, పెద్దబాబు, ఆంజనేయులు, జానీబాషా, శ్యామ్‌సుందర్, శ్రీనివాస్, నరసింహారావు తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగి మృతికి కారకులైన ఇద్దరు సస్పెన్షన్

- లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌లను సస్పెండ్ చేసిన విద్యుత్ శాఖ డీఈ
- పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగింత



అడుసుమిల్లి రాజేష్(ఫైల్)

పెదకాకాని: సచివాలయ ఉద్యోగి మృతికి కారకులైన విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, లైన్‌మెన్ శేషావలిని సస్పెండ్ చేసినట్లు డీఈ టి.శ్రీనివాసబాబు తెలిపారు. విద్యుత్ సరఫరా లేదని చెప్పి పెదకాకాని ఎన్‌టీఆర్ కాలనీ, జీపీఆర్ గార్డెన్స్ మధ్యలో ఉన్న 11 కేవీ విద్యుత్ సరఫరా అవుతున్న స్తంభం ఎక్కి ఫీడర్ కండక్టర్ కట్ చేసి తీసుకు రావాలని ఏఈ బత్తుల శ్రీనివాసరావు ఎల్ఐ రంగారావు, లైన్‌మెన్ శేషావలి, జేఎల్‌ఎంలు మస్తాన్, గోపీ, రాజేష్, వాచ్‌మెన్ ప్రవీణ్‌కుమార్‌లు వెళ్లారు. కరెంట్ సరఫరాను పరిశీలించకుండానే ఎల్ఐ, లైన్‌మెన్‌లు ఏఎల్‌ఎం రాజేష్‌ను కరెంట్ స్తంభం ఎక్కించారు. పైకి ఎక్కి స్తంభంపై కూర్చున్న రాజేష్(27)కు రెప్పపాటులో కరెంట్ షాక్ తగిలి కిందపడి మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శనివారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ వ్యవహారంలో బాధ్యతారహితంగా విధులు నిర్వహించి రాజేష్ మృతికి కారణమైన లైన్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, లైన్‌మెన్ శేషావలిని సస్పెండ్ చేశారు.

ఏఈని సస్పెండ్ చేసి హత్యకేసు నమోదు చేయాలి..

విద్యుత్ సరఫరా లేదని తప్పుడు సమాచారం ఇచ్చి ఏఎల్‌ఎం అడుసుమిల్లి రాజేష్ మృతికి కారణమైన పెదకాకాని ఏఈ శ్రీనివాసరావును సస్పెండ్ చేసి హత్యకేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు.

దుగ్గిరాలలో మద్యం స్వాధీనం

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పంచేందుకు తరలిస్తున్న మద్యాన్ని ఎస్‌ఈబీ స్పెషల్ స్క్వాడ్ శనివారం సాయంత్రం దుగ్గిరాల మంచికలపూడి రోడ్డులో స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు మద్యంతో వెళుతుండగా మరో వ్యక్తి వారిని అనుసరిస్తూ మద్యాన్ని తరలిస్తున్నారు. ఈ సమయంలో గుంటూరు ఎస్‌ఈబీ అధికారులు మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వాహనంతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.